ఉమ్మడి రాష్ట్రంలోనే బాగున్నం

› మొదటిపేజీ తరువాయి...

అన్యాయం జరిగినట్టు అనిపిస్తున్నదని చెప్పారు.

మార్చి 31లోపు నియామకాలు

మార్చి 31లోపు గ్రూప్-1 నియామకాలను పూర్తిచేయనున్నట్టు సీఎం వెల్లడించారు. యూపీఎస్సీ ఇంటర్వ్యూలకు హాజరయ్యే ప్రతిఒక్కరూ సివిల్స్‌లో ఎంపిక కావాలని ఆకాంక్షించారు. సీఎస్ శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరాం, ఎమ్మెల్యేలు వివేక్, కనకయ్య, యాదయ్య, సత్యనారాయణరావు, విజయరమణారావు, కూనంనేని సాంబశివరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సింగరేణికి రూ.1.25 కోట్ల బీమా

సింగరేణి ఉద్యోగులకు ఇకపై రూ.1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా అందనున్నది. బ్యాంక్ ఆఫ్ బరోడాతో సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. సింగరేణి సీఎండీ బలరాం, బ్యాంక్ అధికారులు సీఎం సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఇటీవల మరణించిన సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు కోటి ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. సింగరేణి సీఎండీ ఎన్ బలరాం నాయక్‌పై సీఎం రేవంత్ ప్రశంసలు కురిపించారు. 'బలరాం నాయక్ ఓ గిరిజన యువకుడు. పుస్తకం కొనేందుకు రూ.50 కోసం ఛేనంబర్ చౌరస్తాలో కూలీగా పనిచేసి, ఐఆర్‌ఎస్ అధికారి అయ్యారు. సింగరేణి సీఎండీ వరకు ఎదిగారు. కష్టం.. కమిట్మెంటే అందుకు కారణం' అని బలరాం నాయక్ ప్రస్థానాన్ని సీఎం వివరించారు.

8 బీసీ కులాల పేర్లలో మార్పులు

- రాష్ట్ర బీసీ కమిషన్ నోటిఫికేషన్
- ఈ నెల 18 వరకు అభ్యంతరాల స్వీకరణ

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): కులసంఘాల విజ్ఞప్తి మేరకు 8 బీసీ కులాల పేర్లలో మార్పులు, చేర్పులకు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ నోటిఫికేషన్ జారీచేసింది. బీసీ కులాల సమస్యలపై ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా బీసీ కమిషన్ బహిరంగ విచారణలు నిర్వహించింది. వివిధ కుల సంఘాల నేతలు కమిషన్‌కు విజ్ఞప్తులు చేశాయి. ఆ ఫిర్యాదులను బీసీ కమిషన్ పరిగణనలోకి తీసుకున్నది. దొమ్మర, పిచ్చకుంట్ల, తమ్మలి, బుడబుక్కల, కుమ్మర, రజక, చిప్పోలు, వీరముష్టి కులాల పేర్ల మార్పు కోసం నోటిఫికేషన్ విడుదలైంది. మార్పులపై అభ్యంతరాలుంటే 18లోగా ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో తెలపాల్సిందిగా బీసీ కమిషన్ పేర్కొన్నది.

కులాలు	మార్పులు-చేర్పులు
దొమ్మర	గడవంశీయ
బుడబుక్కల	రామజోషి/ఆరెక్షత్రియ జోషి/శివక్షత్రియ
కుమ్మర	ప్రజాపతి
చాకలి	ధోబీ
తమ్మలి	బ్రాహ్మణేతరులు, శూద్రకులం పదాల తొలగింపు
చిప్పోలు	మేర
వీరముష్టి	వీరభద్రీయ
పిచ్చకుంట్ల	వంశరాజ్

క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీకి క్యాబినెట్ ఆమోదం

- హరిత విద్యుత్తు ఉత్పత్తిదారులకు రాయితీలు
- వచ్చే పదేండ్లలో 1.98 లక్షల కోట్ల పెట్టుబడులు, 1.14 లక్షల ఉద్యోగాలు వస్తాయని అంచనా

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): భవిష్యత్ అవసరాలకు సరిపడా విద్యుత్తును సమకూర్చుకొనే లక్ష్యంతో ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025కి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. హరిత విద్యుత్తు ఉత్పత్తిదారులకు విరివిగా రాయితీలు ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం.. 2030 నాటికి 20 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన వనరులను సమీకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నది. వచ్చే పదేండ్లలో 1.98 లక్షల కోట్ల పెట్టుబడులతోపాటు 1.14 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉంటుందని అంచనా వేసింది. ప్రస్తుతం 15,623 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 2034-35 నాటికి 31,809 మెగావాట్లకు పెరుగుతుందని భావిస్తున్నది. సోలార్, ఫ్లోటింగ్ సోలార్ ఎనర్జీ, విండ్ పవర్, గ్రీన్ హైడ్రోజన్, హైబ్రిడ్ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని, పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇవ్వాలని నిశ్చయించింది.

సమగ్ర సర్వే ఏమాయే!

- 60 రోజుల్లో పూర్తి చేయాలన్నరు
- 80 రోజులు దాటినా ఊసేలేదు
- జిల్లాల పరిధిలో 98% వరకే పూర్తి
- జీహెచ్‌ఎంసీలో 20%లోపే గణన!

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కులాలవారీగా కుటుంబ సర్వేపై సందిగ్ధత నెలకొన్నది. ఈ సర్వేలో ప్రధానమైన కులగణనతోపాటు 75 అంశాలు ఇమిడి ఉన్నాయి. ఇప్పటివరకు తెల్ల రేషన్ కార్డు, ఆసరా పింఛన్, గృహజ్యోతి, మహాలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు పొందుతున్నవారు, భవిష్యత్తులో పొందేబోయేవారు సర్వే నివేదిక కోసం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రణాళిక, గణాంకశాఖ నేతృత్వంలో 60 రోజుల్లో సర్వే పూర్తిచేయాలని నిరుడు అక్టోబర్ 14న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సర్వే నిర్వహణ కోసం రూ.150 కోట్లు విడుదల చేశారు. నేటికీ 80 రోజులైనా కుటుంబ సర్వే ఏమైంది? గ్రామాల్లో ఎంత వరకు పూర్తయింది? జీహెచ్ఎంసీ పరిధిలో ఎంత వరకు జరిగింది? కులాలవారీగా జనాభా ఎంత? కంప్యూటరీకరణ ఎంతవరకు వచ్చింది? ప్రభుత్వానికి సర్వే నివేదిక సమర్పించారా? లేదా అనే వివరాలను అధికారికంగా వెల్లడించనే లేదు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 95 నుంచి 98% వరకు, కొన్ని గ్రామాల్లో 100% మేర పూర్తయినట్టు, జీహెచ్‌ఎంసీలో 20% కూడా దాటలేదని రాష్ట్ర ప్రణాళిక, గణాంకశాఖ వర్గాలు అనధికారికంగా వెల్లడించాయి. 94 వేల మంది ఎన్యుమరేటర్లు, 9 వేల మంది సూపర్‌వైజర్లు సర్వే ప్రక్రియలో పాలుపంచుకున్నారు.

పూర్తయిన డాటా ఎంట్రీ

సమగ్ర కుటుంబ సర్వే పూర్తయిందని రాష్ట్ర ప్రణాళిక, గణాంకశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. సర్వే గురించి వివరణ కోరగా.. సర్వే డాటా ఎంట్రీ పూర్తయిందని, రిపోర్టు ఫైనల్ స్టేజ్‌లో ఉన్నదని, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. తమకు ఎలాంటి నివేదిక అందలేదని సెస్ వర్గాలు తేల్చిచెప్పడం గమనార్హం.

1931లోనే కులగణన

బ్రిటీష్ ఇండియా కాలంలో 1881లోనే జనగణన మొదలైంది. పదేండ్లకోసారి క్రమం తప్పకుండా జరిగేది. దానినే తెలంగాణలో నిజాం సర్కారు అమలుచేసింది. ఈ క్రమంలో 1911లో అంటరాని కులాలను ఒక ప్రత్యేక క్యాటగిరీ కింద నమోదు చేశారు. బ్రిటీష్ పాలనలో, పాకిస్తాన్, బంగ్లాదేశ్ కలిసి ఉన్న ఉమ్మడి భారతదేశంలో 1931లో మొదటిసారి కులగణన జరిపారు. కులాలు, మతాల వారీగా లెక్కలు నమోదుచేశారు. వీటికి అనేక పరిమితులున్నా, ఇప్పటివరకు ఆ లెక్కలే మనకు దిక్కయ్యాయి. నాడు 44 హిందూ కులాలను, రెండు ఆది హిందూ కులాలను, ఆరు ఆదివాసీ తెగలను నమోదు చేశారు. ఉప కులాలను నమోదు చేయనేలేదు. కులగణనతోపాటు ప్రజల జీవన విధానం, అక్షరాస్యత, జీవనోపాధి, ఉద్యోగాలు, వివాహ వ్యవస్థ వంటి అంశాలను పొందుపర్చారు. ఆ తర్వాత ఏ ప్రభుత్వం కూడా కులాలవారీగా సమగ్రంగా, అధికారికంగా గణన చేపట్టలేదు. స్వాతంత్ర్యానంతరం పలువురు ముఖ్యమంత్రులు అధికారికంగా, అనధికారికంగా కులాల లెక్కలు, నియోజకవర్గాల వారీగా, జిల్లాల వారీగా తీసినా వాటిని ఎవరూ వెల్లడించలేదు.

సమాజ స్థితిగతులు తెలుసుకోవడానికి 76 ఏండ్లు

దేశంలో, రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితి తెలుసుకొంటే వారి అవసరాలు, అభివృద్ధికి అనుగుణంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టడానికి అవకాశం ఏర్పడుతుంది. కులగణన చేపడతామని కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలోనే ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ సర్కారు తొలుత బీసీ జనగణన చేయాలని భావించింది. బీసీ సంఘాల నేతల డిమాండ్ మేరకు అన్ని కులాల జనగణన తలపెట్టారు. బీసీ జనగణన జరిపితే అశాస్త్రీయం, పాక్షికం అవుతుందని, అన్నికులాల, వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలతో సమగ్ర కుటుంబ గణన నిర్వహించడం వల్ల సమాజ స్థితిగతులు కొంచమైనా అర్థమవుతాయని ఆయా సంఘాల నేతలు చెప్పారు. ఆయా వర్గాల జనాభాకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ చిన్న విషయం అర్థం కావడానికి కాంగ్రెస్ పార్టీ నేతలకు, పాలకులకు 76 ఏండ్లు పట్టింది.

స్టాండర్డ్ లేబిలింగ్‌తో 30వేల కోట్ల ఆదా

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : స్టాండర్డ్ అండ్ లేబిలింగ్ కార్యక్రమంలో చేపట్టిన స్టార్ లేబిలింగ్‌ను విస్తృతంగా ప్రోత్సహించాలని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ(బీఈఈ) కోరింది. స్టార్ లేబిలింగ్ ఉన్న ఎలక్ట్రిక్ ఉపకరణాల వాడకంతో విద్యుత్తు బిల్లులు గణనీయంగా తగ్గుతాయని బీఈఈ కార్యదర్శి మిలింద్ దేవరా తెలిపారు. ఈ ఒక్క ప్రయత్నంతో 109 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఆదా అయ్యిందని, 88 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గాయని, ఏటా రూ. 30 కోట్లు ఆదా అయ్యాయని వెల్లడించారు. అధికారులకు ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమ ఉద్దేశాలను వివరించారు.

ఢిల్లీలో తగ్గుతున్న తెలుగువారి ప్రభావం

- ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలో సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): దేశ రాజకీయాల్లో గతంలో తెలుగువారు క్రియాశీలకంగా వ్యవహరించారని, కానీ నేడు మన ప్రభావం తగ్గుతోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రపంచ తెలుగు సమాఖ్య 12వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో హిందీ తర్వాత అత్యధికంగా మాట్లాడే భాష తెలుగేనని స్పష్టం చేశారు. రాజకీయ, సినీ, వాణిజ్య రంగాల్లో రాణించినా మన భాషను మరిచిపోవద్దని సూచించారు. 'పరభాషా పరిజ్ఞానాన్ని సంపాదించాలి.. మన భాషను గౌరవించాలి' అని సీఎం పిలుపునిచ్చారు. తెలుగు భాషను గౌరవిస్తూ ప్రభుత్వ జీవోలను తెలుగులో ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. విదేశాల్లో స్థిరపడ్డ తెలుగువారు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావాలని కోరారు. ఈ మహాసభలను ఏపీ సీఎం చంద్రబాబు ప్రారంభించగా.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ముగింపు సభకు హాజరయ్యారు.

సీఎం పేరు మర్చిపోయిన వ్యాఖ్యాత

సీఎం రేవంత్‌రెడ్డికి మరోసారి చేదు అనుభవం ఎదురైంది. సభా వేదికపైకి సీఎంను ఆహ్వానించిన వ్యాఖ్యాత ఆయనను కిరణ్ కుమార్‌రెడ్డిగా సంబోధించారు. దీంతో అక్కడున్నవారంతా కంగుతిన్నారు. సదరు వ్యాఖ్యాత పక్కన ఉన్నవారిని సీఎం పేరు కనుక్కొని, పొరపాటును సరిదిద్దుకొని మళ్లీ పిలిచారు. ఈ మధ్య ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డిని ప్రజలు సీఎంగా గుర్తించడం లేదా? నిజంగానే ఆయన పేరును మర్చిపోతున్నారా? లేక ఉద్దేశపూర్వకంగానే అలా చేస్తున్నారా? అనే చర్చ జరుగుతున్నది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి ఏడాది దాటినా ఆయన పేరు తెలియనివారు ఇంకా ఉన్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నది. సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో ఉంది.

25లోగా 'రక్షణ కిట్లు' పంపిణీ చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): కల్లుగీత కార్మికులకు ఈ నెల 25లోగా 'కాటమయ్య రక్షణ కవచం కిట్లు' పంపిణీ చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మొదటి విడతగా 15 వేల మంది గీత కార్మికులకు శిక్షణ ఇవ్వడంతోపాటు కిట్లను పంపిణీ చేయగా, తాజాగా రెండో విడతలో మరో 10 వేల మందికి కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లా బీసీ డెవలప్‌మెంట్, ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో అర్హుల గుర్తింపుతోపాటు శిక్షణ ఇచ్చి కిట్లు పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు.

ఆధునిక టెక్నాలజీ హబ్‌గా హైదరాబాద్

మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : కృత్రిమ మేధ(ఏఐ), ఆధునిక సాంకేతికతలో గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్ విస్తరిస్తున్నదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రతిభావంతులైన మానవ వనరులు, అద్భుతమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నందున కొత్త సంస్థలు నగరం వైపు ఆసక్తి కనబరుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆదివారం కృత్రిమ మేధ ఆధారిత సేవలు, క్లౌడ్ కంప్యూటింగ్, డాటా డెలివరీలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన 'డాటా ఎకానమీ' నూతన వర్క్‌స్టేషన్‌ను మంత్రి హైటెక్ సిటీలో ప్రారంభించారు. క్వాంటమ్ కంప్యూటింగ్, డిజిటల్ ట్విన్స్, డాటా బదిలీ రంగాల్లో ఈ సంస్థ గణనీయ పురోగతిని సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. తాము నెలకొల్పే ఏఐ సిటీ అభివృద్ధిలో 'డాటా ఎకానమీ' భాగస్వామి కావాలని కోరారు. వచ్చే ఏడాది చివరి నాటికి హైదరాబాద్‌లో మరో 500 మంది కొత్త ఉద్యోగులను నియమిస్తామని 'డాటా ఎకానమీ' ప్రతినిధులు మంత్రికి వివరించారు.

మిగులు.. ఎలా చేస్తే లాభం?

గృహ రుణాన్ని ముందుగానే తీర్చేయాలా? లేక మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడి పెట్టాలా?

శశాంక్ ఓ ప్రైవేట్ ఉద్యోగి. హైదరాబాద్‌లో పదేండ్ల క్రితం రూ.50 లక్షలతో ఓ ఇల్లు కొన్నాడు. నెలనెలా ఈఎంఐలు చెల్లిస్తూపోతున్నాడు. ప్రస్తుతం ఇంకా చెల్లించాల్సిన ఇంటి అప్పు రూ.30 లక్షలుగా ఉన్నది. కానీ నెలనెలా ఈఎంఐలు భారంగా కనిపిస్తున్నాయి. దీంతో రుణంలో కొంతకొంత చెల్లిస్తూపోతే లాభామేమో? అన్న ఆలోచనలోపడ్డాడు. మరోవైపు ఆ మిగతా సొమ్మును మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడిగా పెడితే ప్రయోజనమేమో? అన్న సందేహాలూ మదిని తొలిచేస్తున్నాయి. అయితే ఒక్క శశాంక్‌దే ఈ పరిస్థితి కాదు. మనలో చాలామందిదీ ఇదే పరిస్థితి. మిగులు నిల్వలతో గృహ రుణాన్ని తీర్చాలా? లేక ఆ నిధులను ఇతర ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాల్లోకి మళ్లించాలా? అన్న డైలామా కొట్టుమిట్టాడుతుంటారు. మరి నిపుణులు ఏమంటున్నారు?

ఇదీ సంగతి..

పెట్టుబడి అనేది ఎప్పుడూ ఒకే దగ్గర పోగై ఉండిపోకూడదు. ఒకటికి మించిన సాధనాల్లో పెట్టుబడులు పెడితేనే సురక్షితం. రిస్కులనూ తగ్గిస్తుంది. అయితే ఇల్లు అనేది ఓ దీర్ఘకాల మదుపు. నిజానికి సొంతిల్లు కల సాకారమనేది మంచిదే అయినా.. దీర్ఘకాలంపాటు మన కష్టార్జితం దానికే అంకితం చేసుకునేలా ఉంటే మాత్రం కొంత ఆలోచించాల్సిన అంశమని చెప్పవచ్చు. కాబట్టి అనుకోకుండా మన చేతికి పెద్ద మొత్తంలో నగదు వస్తే.. దాంతో ఇంటి రుణాన్ని వీలైనంత మేరకు తీర్చేయడమే తెలివైన పనిగా భావించవచ్చు. దీనివల్ల ముఖ్యంగా వడ్డీ భారం చాలావరకు తగ్గుతుంది. ఎందుకంటే హోం లోన్ వంటి దీర్ఘకాలిక రుణాల్లో అసలు కంటే దానిపై చెల్లించే వడ్డీ మొత్తమే ఎక్కువ. అసలు, వడ్డీ కలిపి అప్పు కొండను తలపిస్తుంటుంది. ఎంతకీ దిగిరాని పరిస్థితిలో పడిపోతాం. కాబట్టి అనూహ్యంగా వచ్చిన మొత్తాలతో ఇంటి అప్పు భారాన్ని తగ్గించుకోవడం ఉత్తమం. పైగా ఫ్లోటింగ్ వడ్డీరేట్లతో గృహ రుణం తీసుకున్నప్పుడు, మధ్యమధ్యలో కొంత మొత్తాలు చెల్లిస్తే జరిమానాలేవీ పడవు.

నెలనెలా మిగుళ్లతో..

నెలనెలా కొంత మొత్తాలు మిగులుతూపోతే గృహ రుణం తీర్చేకన్నా.. మ్యూచువల్ ఫండ్స్ వంటి వాటిని పరిశీలించడం లాభదాయకమని చెప్పవచ్చు. స్టాక్స్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో మిగులు నిల్వలను దీర్ఘకాలిక పెట్టుబడులుగా పెడితే 10-12 శాతం రాబడులను ఆశించవచ్చు. 8-9 శాతం వడ్డీరేట్లతో ఉన్న గృహ రుణం తీర్చడం కంటే ఇదే నయం మరి. అయితే స్టాక్ మార్కెట్లు, దాని ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు ఒడిదొడుకులకు లోబడి ఉంటాయి. కాబట్టి రిస్కుకు సిద్ధపడితేనే మరింత లాభాలను అందుకోవచ్చన్నది మరువద్దు. రిస్కులతో కూడిన పెట్టుబడులకు ఇష్టపడనివారు దూరంగా ఉంటేనే మంచిది. అయితే ఆర్థిక నిపుణుల సలహాతో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)ను ప్రయత్నించవచ్చు. ఇవికూడా రిస్క్‌తో కూడుకున్నవే అయినా.. మన అవసరాలకు తగ్గట్టుగా ఎక్స్‌పర్ట్స్ సూచనలతో ప్లానింగ్ చేసుకోవచ్చు. నిజానికి దీర్ఘకాలంలో స్టాక్ పెట్టుబడులు మెజారిటీ ఇన్వెస్టర్లకు లాభాల్నే పంచాయని గణాంకాలు చెప్తున్నాయి.



చివరగా..

మదుపరులు ఎప్పటికైనా తమ పెట్టుబడులు బహుళ సాధనాల్లోకి మళ్లిస్తేనే మరింత లాభదాయకం. అలాగే చిన్న వయసు నుంచి చేసే పొదుపు.. పెద్ద లాభాల్ని పంచిపెడుతుంది. స్వల్ప, దీర్ఘకాల లక్ష్యాలకు తగ్గట్టుగా పెట్టుబడి సాధనాలను ఎంచుకోవడం తెలివైన నిర్ణయం. నగదు నిల్వలు సరిపడా ఉంటే వాటితోనే ఇల్లు కొనుక్కోవడం లాభమనే చెప్పవచ్చు. అయితే మోయలేనంత భారాన్ని మాత్రం ఎత్తుకోవద్దు.

సీనియర్లకు ఇవి సరి

పెట్టుబడులకు అనువైన మార్గాలేంటో చూద్దామా?

సాధారణ సిటిజన్స్‌తో పోల్చితే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

1. **సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం**
   ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. గరిష్ఠ కాలవ్యవధి 5 ఏండ్లు.
2. **పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం**
   తపాలా శాఖ అందించే ఈ స్కీంలో వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. మరో 5 ఏండ్లు పొడిగించుకోవచ్చు.
3. **సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం**
   60 ఏండ్లు, ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి బ్యాంకుల్లో వచ్చినదే ఈ స్కీం. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లు. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానా ఉంటుంది.
4. **ఫిక్స్‌డ్ డిపాజిట్లు**
   బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు.
5. **సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్**
   సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ పథకం. వీటిపై వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. మదుపరులు ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.
6. **మ్యూచువల్ ఫండ్స్**
   మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది.
7. **నేషనల్ పెన్షన్ సిస్టమ్**
   నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం.
8. **పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్**
   పీపీఎఫ్‌ల్లో పెట్టుబడి ఇన్వెస్టర్లకు ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు ఉంటుంది.
9. **ట్యాక్స్ ఫ్రీ బాండ్లు**
   ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరపున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.
10. **ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం**
    ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు తదితర సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను ఆదా చేసుకోవచ్చు.

క్రయవిక్రయాల మధ్య ఊగిసలాట!

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గత ఏడాది తరహాలోనే మదుపరులు అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఊగిసలాటకు లోనవుతుండటంతో కొత్త ఏడాదీ ఆటుపోట్లు తప్పడం లేదు. గత వారం ట్రేడింగ్ ఇందుకు నిదర్శనం. ఆఖర్లో చోటుచేసుకున్న నష్టాలు.. ముందటి లాభాలను మింగేయకపోతే సూచీలు మరింత పై స్థాయిల్లోనే ఉండేవి. ఇక అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 524.04 పాయింట్లు లేదా 0.66 శాతం పెరిగి 79,223.11 వద్ద ఆగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 191.35 పాయింట్లు లేదా 0.80 శాతం పుంజుకుని 24,004.75 దగ్గర నిలిచింది. ఈ క్రమంలో ఈ వారం కూడా ట్రేడింగ్‌లో ఎత్తుపల్లాలకు ఆస్కారముందని మెజారిటీ నిపుణులు చెప్తున్నారు. అయితే బ్యాంకింగ్, ఆటో, ఐటీ రంగాల షేర్లలో ర్యాలీకి వీలుందనీ అభిప్రాయపడుతున్నారు. కానీ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం.. మార్కెట్ జోష్‌ను బాగా దెబ్బతీస్తున్నది. భారీగా పడిపోతున్న రూపీ ఎక్స్ఛేంజ్ రేట్లు.. ఇప్పటికే ఆల్‌టైమ్ కనిష్ఠానికి దేశీయ కరెన్సీని పరిమితం చేశాయి మరి. ఫలితంగా మరింత రూపాయి క్షీణత.. స్టాక్ మార్కెట్లను ఇంకా ప్రభావితం చేయవచ్చు. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ ముఖ్యమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,600 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,400 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,300-24,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.